# కొమ్మ కొమ్మకో సన్నాయి!

శ్రీ కందుకూరి లింగరాజు

ఎర్రగా, పొడుగ్గా, నాజూకుతనం ఓడిపోతుంటే, ఎక్కువదూరం రైలు ప్రయాణంలో నలిగిపోయిన చిహ్నాలు పైకి కనబడుతూనే, వీధిలో టాంగా ఆపి, లోపలికివచ్చింది.

సావిట్లో కూర్చున్న యాజులు చదువుతున్న 'శేంషమ్ హార్వెస్టు' పుస్తకం మూసి, కంగారుగా లేచేడు. ఈ జబరదస్తీగా వచ్చిన ఆవిడనిచూచి కళవళపడి, కళ్ళప్పగించేడు.

"ఇదేనా సోమయాజులుగారి ఇల్లు?" అంది.

తలూపేడు.

"ఏయ్. బండి అబ్బాయ్! సామాను లోపల పెట్టు" అని ఆదేశించి ఓసారి కిటికీవూచల్లోంచి సామాను దింపడం చూచి, లెఖ్ఖపెట్టుకుని సరిగ్గా వచ్చేయి, అని తలూపుతూనే, డబ్బులు ఇచ్చేసింది.

ఉస్సురంటూ మొఖం తుడుచుకుంది.

"కూర్చోండి" అన్నాడు యాజులు, ఇంత వరకూ పట్టాపుచ్చుకున్న మర్యాదలు మంటకలిసిపోతే, నాలిక కరచుకుంటూ తన తప్పిదం తెలుసుకుని.

"కాసిన్ని కాఫీనీళ్ళు దొరుకుతాయా ఈ యింట్లో? రాత్రల్లా కంటిమీద కునుకేలేదు. స్టేషన్లో వాకపుచేస్తే 'టీ' కాని కాఫీ దొరకదన్నారు ఈ దేశంలో."

నవ్వేడు. ఈవిడకి ఇదే ప్రథమప్రయాణం ఈ మహమ్మదీయ సామ్రాజ్యంలోకి అని. లోపల్కి వెళుతూ, ఫ్లాస్కు, ఒకకప్పు సాసరు తెచ్చి, పోసి చేతి కిచ్చాడు.

"థాంక్స్"అంది. అతి ఆప్యాయంగా తాగుతూ, అలవాటు అయిన ప్రాణంలా తేరుకుంది.

"చాలా బాగా వుంది. మీరే తయారుచేసేరా? ఏ హోటలుదైనానా?"

గతుక్కుమన్నాడు యాజులు. తను ఇంట్లో కుంపటి అంటించలేక, దాన్ని విసరి నీళ్ళు దింపినప్పుడు చేతులు కాల్చుకుంటూ తయారుచేసిందని ఈవిడకు ఎల్లా తెలిసిందని? వీధిగదిచూస్తే, ఆ సోఫాలు గోడకు తగిలించిన క్యాలెండర్లు, గుమ్మాలకు వేసిన పర్దాలు కూడా, ఓ ఆఫీసరు ఫాయిదాలో వుండివున్నాయి. అల్లాంటప్పుడు పైకి పటారం లోపల లొటారం అనుకోటానికి ఆస్కారం కూడా లేదు.

"మా కుర్రాడు తయారుచేసేడు." అనేసేడు, గొప్ప తరిగిపోతుందేమో, ఆవిడ కళ్ళల్లో చాలా చిన్న వాడిగా ఆపాదింపబడిపోతానేమో అనిన్నీ.

"వక్కపలుకు లేమైనా ఉన్నాయా?"

ఒళ్ళు మండింది ఈ జులుంకు. ఆవిడ యెవరో తనకి తెలియదు. పోనీ వచ్చినా, ఆవిడ తన ప్రవర; చుట్టమో, పక్కమో చెప్పాల్సింది. అది చెప్పలేదు. పైగా ఆవిడ ఏదో స్వంత ఇంటిలా తనమీద అధికారం చెలాయించడం అపసవ్యంగా కన్పించింది. చికాకు కలిగించింది. అయినా వచ్చిన అతిథి మహిళ కావడం వల్ల మర్యాదకు లోపం అనుకుంటూనే లేచి వక్క పొడి డబ్బా తెచ్చి, చేతికి ఇచ్చేడు.

నోట్లో వేసుకుని "అయితే మీకు ఇక్కడ అల వాట్లు కాలేదన్నమాట." అంటూనే పూర్ణంగా నవ్వింది.

ఆ నవ్వు చూస్తుంటే, బుగ్గలు సొట్టపడి కాటిక కళ్ళు చికిలించి ఉండడం, మెచ్చిన కలవకువ్వల్ని జ్ఞప్తికి తెస్తే, క్షణం మనస్సు 'ఎంత అందంగా నవ్వింది.' అన్న సౌందర్య ఉపాసనలో మునిగి, శీతా కాలం అనుకుంటూ తేరుకుంది.

ఇంతకీ తనెవ్వరో చెప్పలేదు. ఏంపనిమీద వచ్చిందో కూడా తెలియపరచలేదు. ఈ సామాను వాటం చూస్తే, కనీసం పదిరోజులు ఇక్కడ మకాం వేసేట్టు తేటతెల్లంగానే వుంది. మూలమూలలనుండి, కోశకోశాలనుండి తనవైపు బంధువుల్లో వెతుక్కున్నాడు; ఈ వ్యక్తి స్థలం కన్పించటంలేదు. ఆత్మీయులు మిత్రుల కోవల్లో అతుకటంలేదు. 'మరెవ్వరూ?' ఇదే ప్రశ్న తొలచూనికం అయితే; సతమతమయ్యేడు యాజులు.

పైగా ఈ పూట భోజనానికి ఉండేటట్టు వుంది. ఇంట్లో వేసిన అర్ధపావు బియ్యం అత్తెసరు, వేయించిన

అర అరటికాయ ముక్కలు, పచ్చిచారు తప్ప లేవు. ఇక్కడ భోజనం చేస్తానంటే తన పునాదులు లేచి పోతాయి. కొద్దికాలం క్రితం అన్న కుర్రాడు మాట మిథ్యగా పరిణమించి, తలవొంపు కల్గచేస్తుందికూడాను.

"కాస్త స్నానం చేసి బట్టలు మార్చుకోవాలి" అంది యథాలాపంగా.

"దానికేం...రాండి..."అంటూనే లోపల్కి దారితీసేడు. స్నానాలగది చూపిస్తూ, సబ్బుబిళ్ళ గూట్లో పెడుతూనే "నాకు వేడినీళ్ళ అలవాటులేదు" అనేసేడు.

"ఫర్వాలేదు. నాకూ మా ఇంటిదగ్గర ఎంత చలి కాలం అయినా చన్నీళ్ళే అలవాటు" అంటూనే సమాధానం చెప్పింది. పెట్టె తీసినపుడు, పక్క బుట్టలోంచి చక్రకేళీ అరటిపళ్ళు, బత్తాయికాయలు, నారింజ కాయలు పైన పెట్టి, "లోపల పెట్టండి."అనీ అనేసింది.

ఐదువత్సరాలనుండి ఎండిపోయిన ఈ వుద్యోగ ఫాయిదాలో ఎవరూ, ఇంతటి ఆపేక్ష తనమీద చూపించలేదు. మడికట్టుకున్నానని ఎవరేనా ఏ పళ్ళో తీసుకువస్తే, దుయ్యపట్టేసేవాడు. ఇప్పుడు ఈ తెలియనివ్యక్తి, అవి తీసుకువస్తే తన నోరు పెగలలేదు. పైగా ఎన్నాళ్ళనుండో ఈ గొడ్డుదేశంలో దొరకని పళ్ళు, ఎదురుగా ఆవిడ తనకోసం అనడం, వాట్ల కోసం తను కలవరించినరోజులు జ్ఞప్తికి రావడం, ఓవిధంగా తన్నేతాను సంబాళించుకోలేకపోయేడు.

"అదేమిటి! మీరు ఇంట్లో చెయ్యికాల్చుకుంటున్నారా? వారిని పుట్టింటికి పంపేరా? లేక ఏ మిఠాయి తినే సందర్భంకోసమో ఎదురుచూస్తున్నారా?" అంది వంటింట్లోంచి ఆవిడ పర్యవేక్షణ అంతంలో.

'చచ్చేంరా శివా!' అనుకున్నాడు. ప్రశ్నలు యథాలాపంగా వున్నా, ఎందుకో కడుపుదేవేసి నట్లయింది. ఇంతవరకూ తను సంసార సుఖం ఎరగనే ఎరగడు. హోటలుకూడు తినలేక తనరాత అనుకుంటూనే, చెయ్యికాల్చుకుందుకు పరీక్షా రుసుం చెల్లించేడు. ఈ ఉప్పుకారాల తక్కువ ఎక్కువల్లో తన నలభీమపాకాన్ని ఆ హోటలు సాంబారుతో పోల్చుకుని, తృప్తిపడేవాడు. ఆ రహస్యం చిదంబర రహస్యం వతు ఇప్పుడు కావడం, అందులోనూ ఆయువలివల్ల అన్న విషయం తబ్బిబ్బు చేసింది. మనస్సు కించపడింది. ఆ వేసిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వనేలేదు.

"కుంపటీ అవి ఎక్కడున్నాయో చెప్పండి. రెండునిమిషాల్లో చేసేస్తాను." అని ఆదేశించింది; జడ అల్లుకుని, పౌడరు బులబులాగ్గా వేసుకుంటూ.

తెల్లబోయేడు. ఈవిడ ఎవరు? తన కులమేనా? ఏమిటీ చొరవ? అర్థం కాలేదు.

"ఎందుకూ శ్రమ. హోటలుకు వెళదాం."

"చంపేసేరు. గత మూడు సంవత్సరాలనుండి హోటలు మెతుకులు తిని నాలిక బెరడ కట్టుకుపోయిందండి. వంటచెయ్యడం వచ్చుగా. ఫర్వాలేదు." అంటూనే కుంపటి సవరించింది. తప్పదన్నట్టే లేచి, బియ్యం, మిగిలిన అర అరటికాయ ముందరపెట్టేడు యాజులు.

ఆవిడ అన్నముక్కల్లో ఒక్కటే భావం స్ఫురించింది. ఏ కాలేజీలోనో చదువుకుంటూ, ఏ తను మర్చిపోయిన స్నేహితుని దగ్గరనుండో తనకి ఉత్తరం తెచ్చి మార్కులవేటకు బయల్దేరిన విద్యార్థిని అన్నది నిరుకు చేసుకున్నాడు. ఒక్కసారి తనవిద్యార్థిదశ, అందులో సహపాఠీలుగా ముగ్గురు అమ్మాయిలు, ఇవన్నీ స్ఫురణకువచ్చేయి. వెనువెంటనే ఈ ఒంటరి జీవితంలో ఆ లిల్లీ పంతులమ్మతో గడుపుతున్న రోజులూ గుర్తుకు వచ్చేయి.

వ్యక్తావ్యక్తంలో లిల్లీ ఈ అమ్మాయికంటే నికృష్టురాలు అనే అనుకున్నాడు. ఈవిడ అందంలో, హొయల్లో, బింకంలో, మాటల్లో ఓవిధమైన ప్రత్యేకతవుందీ అని నిర్ణయం చేసుకున్నాడు. తీగలు సారించనూ సారించేడు మిథ్యలో.

టొ కాయించినట్లుగా 'యాజులూ! నీ భావన గోడలు దాటుతున్నాయి. నువ్వూ రోడ్ సైడ్ రోమియోవి అవుతావా?' అని మనస్సు ఎత్తి కుదేస్తే, కూర్చున్న కుర్చీలో ఇంకొక ఇద్దరు కూర్చోవచ్చు అన్నంతస్థలం వుందన్నట్టే ముడుచుకుపోయేడు. దాంతో యాజులు యాజులే అయ్యాడు.

అటు ఆఫీసుటైం అయిపోతోందన్న తొందర్లో, తను చేదోడుగా వుంటానని తయారైతే 'ససేమిరా' వద్దంటూనే ఆవిడ త్రోసివెయ్యడం జరిగింది. పదీ కొట్టకుండానే "రండి! భోజనం చేద్దాం" అన్న పిలుపూ వచ్చింది. తను అనుకున్న వ్యంజనాల కన్న అదనంగా కంచం చుట్టురా వుండడంచూచి నోరు తెరచేడు యాజులు.

"మీరు కూర్చోండి."

"పర్వాలేదు, ముందు మీరు."

"అల్లా పనికిరాదు." అంటూనే పెట్లోంచి కంచం తీసి, పెట్టుకునే వరకూ వదిలేడు కాదు. సరసనే ఆవిడ భోజనంచేస్తూవుండడం, ఈ రొండంచేతి మారులతో, అంతా విచిత్రంగా తట్టింది. వద్దువద్దు అనుకుంటూనే రెండుముద్దలు ఎక్కువగానే తిన్నాడు యాజులు.

ఉండుండి "ఇంతకీ మీ రెవరో చెప్పేరు కాదు. ఇల్లా అతిథిగా వచ్చిన మీ చేతనే ఇంటిల్ల చాకిరీ చేయించుకోవడం నాకు..." ఆగేడు.

"ఏమిటి?"

"చచ్చినంత చావుగా వుంది."

గట్టిగా నవ్వేసింది. తను ఉదయం నృసింహస్వామికి పెట్టిన మందారపు పువ్వు శివలింగం మీద పడింది గాలికి.

"నేను నేనే" అంది నవ్వుతూ.

"అది కాదనటం లేదు. కాని నాకు గుర్తుకు రావటం లేదు."

"అల్లాగే వుండండి. ఇప్పుడు పోయిం దేముంది? నే నెవరో, ఎందుకువచ్చేనో, ఎవరి అమ్మాయినో, ఏం చదివేనో ఒక్కసారి చెప్పేస్తే రేపు మాట్లాడుకుందుకు ఏమీ వుండవు. అందుకే తెలిసిన తెలియని దాన్ని అనుకోండి."

వెలక్కాయ పడింది గొంతులో యాజుల్కి. రేపు ఉండడం నిరుకన్నమాట. అయితే ఇంత ఇల్లూ ఈవిడచేతుల్లో పెట్టి వెళ్ళడం ఎల్లా? ఇల్లాగే వంక పెట్టి ఉన్నవన్నీ దోచుకుపోతే! ఆలోచనల్లో భృకుటీకృతం అయింది ముఖం.

"మీరు బట్టలు వేసుకొనేసరికి నేను ఇల్లు సర్దేస్తా. ఒక్కసావిడిగది నాకు చాలు. తక్కిన ఇంటికి తాళం వేసుకోండి" పసికట్టినట్లే అంది.

త్రుళ్ళిపడ్డాడు యాజులు.

తాళం వెయ్యకుండానే "ఏడుకొండల వెంకటరమణా నీదే భారం" అంటూనె గుమ్మం దాటేడు. బస్సులోంచి చెయ్యి వూపిన లిల్లీని చూడకుండానే రోడ్డుమీద నడిచేడు.

*　　*　　*　　*

పంఖాక్రింద కూర్చుని తనపని తను చేసేసుకునే బయటపడుదా మనుకున్న యాజులుకు, అవ్వాళ పని తెమలనే లేదు. మనస్సు అన్యథా ఆలోచనలను ముందు ముందుకు త్రొయ్యడంతో, అసలుపని చెయ్యబుద్ధి వెయ్యలేదు. ఇంటిదగ్గర ఏమైపోతోందో అన్నదృష్టే. 'అక్కడ ఉన్నవన్నీ సవరించి, మూటకట్టుకుని ఆవిడ మధ్యాహ్నం రైలు ఎక్కేసిందేమో! తను వర్థివాజమ్మ కాకపోతే నిలబెట్టి 'ఎందుకు వచ్చేవు? ఏంపని?' అని అడగవద్దూ? ఎంత ఆడదైతే మాత్రం అల్లా, క్షణం పూర్వం చూచిన క్రొత్తిముఖానికి ఇల్లు వదిలెయ్యడమా? పోనీ పోతే పోయేయి, తను దాచుకున్న ఆమూడువందలైనా దగ్గర వుంచుకుంటే బుద్ధిలో మెల్ల కాదూ? ఈ విధంగా ఒకటి తర్వాత ఒకటి సవాళ్ళు ఎదురీదేయి.

ఇక వుండలేక నే, ఓగంట ముందుగానే బయలుదేరేడు. వేసుకున్న ప్రోగ్రాంప్రకారం లిల్లీ తనూ సినీమాకి వెళదాం అనుకోవడం, ఇప్పుడు ఈ మారిన వాతావరణంలో, ఆ లిల్లీ తన ఇంటికి తనకంటె ముందుగానే వెళ్ళితే, తను ఎంతపతనమై పోయిన వాడులా ఆవిడకళ్ళల్లో తడతాడో అని భయపడ్డాడు. త్వరగానే అడుగులు వేసుకుంటూ లిల్లీ ఇంటికి చేరి, లేకపోవడంతో 'మట్టాలు వచ్చేరు' అని ఉత్తరం వ్రాసి పెట్టి, ఊపిరి విడిచేడు.

గుమ్మంమెట్లు ఎక్కుతుంటేనే ఎదురుగావచ్చి "రండి! రండి! మీ కోసం ఎదురు చూస్తూ వున్నా" అంది నవ్వుతూను.

మనస్సు కుదుటపడింది, నిలువుదోపిడీ అవనందుకు.

ఓ ప్లేటులోనే ఓ కారం, రెండుతీపి, కాఫీ కప్పుతో టి ఎదుటపడింది. ఇవన్ని ఎక్కడనుండి వచ్చేయి అన్న ఆశ్చర్యం కనపరిస్తే "బజారుకు వెళ్ళాను" అంది. యథాలోకపు కబుర్లు చెపుతూనే "నేను వచ్చిన పనేమిటో చెప్పమన్నావా?" అంది చిలిపిగా.

"మీ ఇష్టం" అనేసేడు, తీరా ఆపనే ఘంటల్లో అయిపోతే వెళ్ళిపోతుందేమో అన్న ఆరాటంతో.

"మొన్న మార్చి పరీక్షకు కూర్చొన్నాను. ఇంగ్లీషులో లొంగసానుగా వుంది. వెంకట్రామయ్యగారు మీ దగ్గరకి వెళ్ళమన్నారు."

ఒకందుకు తన భావన అబద్ధం కాలేదని సంతోషం కలిగినా, ఆ వెంకట్రామయ్యగారెవరో అర్థం కాలేదు. ఏకోశాన్నీ అందకపోతే అడుగుదా మనుకున్నా, తీరా అడిగేస్తే బావోదని వూరుకున్నాడు.

"ఫస్టు, సెకెండు పేపర్లు బాగానే వ్రాసేను. మూడోది అనుకోనివన్నీ వచ్చెయ్యడం మూలాన్ని లాటరీ తప్పిపోయింది."

"ఈ కాలేజీ ఇంగ్లీషు లెక్చరర్ దగ్గరకు వచ్చేయాఁ?"

తలూపింది, కాస్త ప్రాధేయంగానే. "మీరు కూడా సహాయం చెయ్యాలి. వచ్చేసంవత్సరం యం. బి. కి వెళ్లాలనుకుంటున్నా. ఈ ఏడాదిపోతే.." దిగులు, నిరుత్సాహం బాగా ప్రదర్శించింది.

"నా చెయ్యతగ్గ సహాయం చేస్తాను," అనేసేడు ఓవిధంగా అందం ఎక్కేస్తూ.

ఎంతో సంబరపడిపోయింది. "వెంకట్రామయ్యగారు ఎంతో ఎక్కువగా చెప్పేరు మిమ్మల్ని గురించి. తప్పకుండా సహాయం చేస్తారు. వెళ్ళు అని ముందరికి తోస్తేనే వచ్చేసేను. మీలాంటివాళ్ళు..."ఆగి చిలిపిగా కళ్ళంలోంచి చూచింది.

మైసూరు గంధపుపొడి పొగ వేసినట్లే అయింది యాజులుకు.

"అ! మర్చిపోయే!మధ్యాహ్నం ఉసుపోక ఇంట్లో ఏమేమి సరుకులున్నాయో చూచేను. ఎందుకైనా మంచిదని, తగుమాత్రంగా కొని తెచ్చేను. బిల్లు అట్టే అవలేదు. పదిహేను రూపాయిలు.అందులోసగం నాది. సగం మీది" అంటూనే పుల్లారి సర్వయ్య బిల్లు చేతిలో పెట్టింది. ఓసారి క్రిందా పైనా చదివేడు. అవాలు, మెంతులు, మిరపకాయలు వగైరా వంటింటి మహారాజులు ప్రవరఅంతా వుంది; వార్షికంగా ఇచ్చే బిరుదాలు అంతస్థుల్లా తూకాలు ప్రక్కగా వుంటే.

కోపం వచ్చింది. చుట్టమైవచ్చి దెయ్యమై పట్టుకున్నట్లుగా వుందే ఈ అనవసరహాయం. తన్ని ఏదో రొంపిలోకి దింపుతున్నట్లూ అనిపించింది. పైకి క్రక్కలేక, ఎంత త్వరగా ఆ మార్కులు పరిహారంచేస్తే అంత మంచిదీ అని అనుకునే "అయితే అల్లా వెళ్ళివస్తా కాలేజీ వేంపు" అన్నాడు లేస్తూ.

"ఇప్పుడే!"

తలూపేడు.

"పోనీ రేపు వెళ్ళుదురుగాని" అంటూ గరాబం కుడిచినట్లు వళ్ళు త్రిప్పింది. "ఇవ్వాళ ఎంచక్కా సినీమాకి వెళదామనుకున్నాను.వంట అప్పుడే చేసేసేను కూడాను" అనీ ఆఖరు చేసింది.

గుండెలు గొలపెట్టేసేయి. అటు లిల్లీతో రానని, ఈవిడతో సినీమాకి వెళితే, తప్పి దారి అదిచూస్తే, అంతా బెంకాయి పిచ్చికొండలా వుంది. ఏదో రెండు పూటలు నోటిరుచి విజృంభిస్తోంది అన్న సంతోషం ఓప్రక్కగా వున్నా, ఇల్లా ఒంటిరిగావున్న జీవితంలో. ఈవిడతో వుండడం, సినిమాలకు షికార్లకు వెళ్ళడంవల్ల తనస్థితి ఎంతవరకు పతనం చెందుతుందో అన్న బెంగా కల్గింది. లిల్లీతో సహవాసం ఎంతో గోప్యంగా వుంచే రెండు సంవత్సరాలనుండి గడుపుకు వచ్చేడు. ఈ ప్రస్తుతానికి ముసుగువెయ్యడం అసాధ్యం కూడాను.

దొడ్లోకి వెళ్ళి ముఖ ప్రక్షాళనం చేసేడు. పెట్టె తీసినప్పుడు, ఏదో మామూలు బట్టలుకాక శిల్కు చొక్కా, లినెన్ ప్యాంటుమీదికే వెళ్ళేయి చేతులు. ఆవిడా సన్నటి ఔరంగాబాదు ఆరుద్ర పురుగురంగు చీర, నేవీబ్లూ చోళీ, ఆకుపచ్చటి జోళ్ళు వేసుకుంది. వేనిటీ బ్యాగ్‌లోంచి అత్తరువు పూసుకుంది.

"ఏం! అల్లా చూస్తున్నారు?" అంది చిలిపిగా.

తల గోక్కున్నాడు. ఓసారి ఎగాదిగా చూస్తే సిగ్గున్నా పడ్డాడు. అందులోంచి తేరుకోలేక, ఆదరాబాదరాగానే బయటపడ్డాడు.

ఒకరిప్రక్కగా ఒకరు కూర్చుని సినీమా చూస్తుంటే, యాజుల్కు ఏదో క్రొత్త అనురాగం అనుభూతి కలిగాయి. లిల్లీతో రహస్యంగా బాల్కనీలో కూర్చున్నవతుకంటే, ఇప్పుడు ఈ మొరాయించి అందరిలోనూ కూర్చోపెట్టిన ఆవిడ పట్టుదలదానికి వన్నెలు పెట్టింది. మొదలు పెట్టేవరకూ అటూ ఇటూ చూచేడు ఎవరేనా పసికట్టేగా అని. ఆ ఆదంపతులు వాళ్ళవాళ్ళ గొడవల్లో వుండిపోవడంతో తృప్తి పొందేడు; ధైర్యం తెచ్చుకొన్నాడు.

అచేతనంగా తగిలినట్లుగా, అప్పుడప్పుడు, ఆ భుజాలు తనకి తగలడం జరుగుతూనే వుంది. మధుర ప్రశాంత యామినిలో మత్తు కల్గచేసినట్లువున్నా, సిగ్గుపడిపోయి కుంచుకుని పోయేడు. చెవుల చివుళ్ళ మీదుగా వచ్చిన అత్తరు వాసనలు మత్తు కల్గించేయి.

ఇంటర్వల్ అయేసరికి- చీరకుచ్చెళ్ళు సర్దుకుంటూనే మూర్తీభవించిన మర్యాదా చూపించింది. చీకట్లోంచి వెలుతురన్నట్లుగా కళ్ళు సరిచేసుకునేటప్పటికి, ముందువరుసలో చివరగా లిల్లీ, తల్లి కన్పించేసరికి, యాజుల్కు పునాగులు లేచిపోయాయి. కంగారుపడ్డాడు. ఏది అవకూడదో అదే రూపొందింది.

కళ్ళమ్మట నిప్పులు రాలుతుంటే, దిగమ్రింగుకుంటూనే "హల్లో మిస్టర్ యాజులూ"అంటూ లిల్లీ వచ్చింది.

"హల్లో మిస్ లిల్లీ! మాకు దగ్గర బంధువులు ఇవ్వాళ ఉదయం వచ్చేరు. ఇంటర్మీడియట్ పరీక్షకు వెళ్లేరు." పరిచయంలో తెలదాచుకున్నాడు. అందులో కంగారు తడబాటూ బాగా వుండిపోయాయి.

కరచాలనం అయ్యేంతర్వాతనే "కూర్చోండి" అంది ఆవిడ సరసనేవున్న కుర్చీ చూపిస్తూ.

ఏవో ఏవో మాట్లాడుకున్నారు. ఆ కాలేజీలోనే లిల్లీ చదివిందన్న ప్రాతవిద్యార్థినీదశలోనే మునిగిపోయేరు. ఇది ఓవిధంగా యాజులుకి తెరిపి నిచ్చింది కారుమొయిలు విచ్చినట్లుగా.

"నన్నా పిలిస్తే నేను రానన్నానా?" అంది లిల్లీ.

"మేం అనుకోలేదు. ఇవ్వాళ ఇల్లా ప్రోగ్రాం పడుతుందని."

"ఒట్టి అబద్ధం" అంది ప్రణయకోపంతో."

"నిజంగా నా మీద ఒట్టు" చిన్నపిల్లాడిలా యాజులు తడబడ్డాడు. అచేతనంగా చెయ్యి చాచేడు.

ఫక్కున నవ్వేసింది ఆవిడ. ఇద్దరు తెల్లబోయేరు. మళ్ళీ పేచీలు పడనేలేదు సినీమా అయ్యే వరకూ. వంచినతల ఎత్తుకోలేకపోయేడు యాజులు.

"ఓసారి మా ఇంటికి రండి" అంది లిల్లీతో శెలవు తీసుకుంటూనే. యాజులు గుండె దడ ఎక్కువే అయ్యింది. ఏమేమి ప్రశ్నలు వస్తాయో అని.

ఆ భోజనాలదగ్గర కూర్చునేవరకూ ఆమె మాట్లాడనే లేదు. ఇది మరింతగా క్రుంగతీసింది యాజుల్ని.

"మీకు పెళ్ళయ్యిందా?"

తెల్లబోతూనే తలూపేడు.

"పొద్దున అడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పేరే కాదు. ఆవిడ ఎక్కడవుంది? పిల్లలా? ఎంతమంది? అత్తారి వూరు?"

తెప్పరిల్లడానికి అవకాశంలేదు. దొడ్లోవున్న సన్నజాజుల పందిరి జీమూతంగా కన్పిస్తే, దాన్ని చూస్తూనే, ఏదో ఆలోకాల్లోని బాధ అనుభవిస్తున్న కంఠంతో "అప్పుడు, బొడ్డూడని రోజుల్లోనే, శారదా బిల్లు అంటూ పెళ్ళిచేసేడు మా నాన్న. తర్వాత తర్వాత మాట పట్టింపులు పెరిగేయి. అవి బద్ధవైరంలోకివచ్చి, గుమ్మాలు త్రొక్కకుండా వుండిపోయేయి. ఆ మను గుడుపుల్లో చూచిన లేతమొఖం తప్ప మళ్ళీ చూడనే లేదు. ఇప్పటికి మా నాన్న నాకు పెళ్ళి అవలేదని, సంబంధాలు వెతుకుతూవున్నాడు. ఇదంతా తలచుకోవడం నాకు..."

"వ్యక్తిత్వం వచ్చింతర్వాత మీరు ఏం చేసేరు?" అతని మౌనం అర్థం చెప్పినట్లయితే "లిల్లీని పెళ్ళిచేసుకుందా మనుకుంటున్నారా?" అంది.

కుంపటిమీద సత్తుగిన్నె కరగిపోయినట్లయ్యింది.

"నేను ఉండడం ఈ పరిస్థితిలో మంచిది కాదేమో! ఏదేనా హోటలు మంచిది వుంటే చెప్పండి. రేపువెళ్ళి అందులో వుంటాను" అని అనేసింది.

ఎక్కడ తగలాలో అక్కడే చురక తగిలింది.

"అంత పశువుని కానేమో! మీరు ఆ భావం పెట్టుకోవద్దు. ఉన్న రెండు రోజులూ వుండండి ఇక్కడే. కావలిస్తే నేనే ఏ స్నేహితుడింట్లో అయినా పడుకుంటా, అంతనమ్మకం లేకపోతే" అని తడబడిపోతూ చెప్పేడు.

"చూచేరూ! వివాహసంస్థ అన్నదే మానసికమైన కట్టుబడులు, నిజాయితీ మీద ఆధారపడింది. ఇప్పుడు మీరు గుండెలమీద చేతులు వేసుకుని చెప్పండి. ఆవిడ మీకు ఏం అన్యాయం చేసింది? ఏ ద్రోహం ఒనర్చింది! మీమీ మూర్ఖపు పట్టుదలల్లోకి వెళ్ళి ఆవిడను బలిపెట్టేసేరే! ఉరి బిగించి ఆజన్మాంతం ఏడవమన్నారే.

"విజ్ఞానం, చదువు పట్టాలతో పుచ్చుకున్నా మానసిక సహృదయత్వం పెంపొందందే కాని ఏమనిషీ మనిషి అనిపించుకోడు. మీరూ విశ్వవిద్యాలయంనుండి పట్టాలు పుచ్చుకున్నారు. అయినా మీరు ఇల్లా చేసేరంటే ఎంతో ఇదిగా వుంది.

"ఔను. స్త్రీ అంటే మగాళ్ళదృష్టిలో అంత చులకన. అక్కడ ఆవిడ ఈదురోగోడో అంటూ ఏడుస్తుంటే, ఇక్కడ మీరు మీ మమకారం, అభిమానం, కోర్కెలు లిల్లీతో తీర్చుకుని పెద్దమనుష్యులైపోయేరు. ఇది న్యాయమేనా అని ఆలోచించే విచక్షణ కూడా పోగొట్టుకున్నారు!

"కాదంటారా?"

కాలేజీ వక్తృత్వపు పోటీల్లో నిలబడి, బల్లగుద్దినట్లే మాట్లాడింది.

"మీకు సంగతి సందర్భాలు తెలియవు. కనుక అల్లా నన్ను దుయ్యపట్టుతున్నారు."

ఏవూరు, మామగారి పేరు, ఎడ్రస్ మాటల్లో లాగేసింది. పడుకోబోయేటప్పుడే పీథగదితలుపు వేస్తుంటే "అక్కర్లేదు. ఆ నమ్మకం నాకు వుంది." అనీ అనేస్తే ఈ వ్యక్తిలో ఇంకా ఇంద్రధనుస్సులు ఎన్నివున్నాయో అన్న ఆలోచన కలిగింది.

ఆ రాత్రి మగత పాడికళ్ళల్లో, ఎంత గుర్తుకు తెచ్చుకుందామనుకున్నా, భార్య కస్తూరిరూపం కట్టనే లేదు యాజుల్కి.

* * * *

ఆఫీసుకు వెళ్ళదామని మెట్లు దిగుతుంటూనే యాజులు చేతుల్లో మూడు కవర్లు పెట్టి "కాస్త దయయుంచి పోస్టాఫీసులో పడేయించండి" అని ప్రాధేయపడింది. ఆ సుతారంగా అడుగులకు మడుగులొత్తినట్లు అనడంకు ముగ్ధుడే అయినీ్న పోయేడు.

"మర్చిపోయే. ఇవ్వాళ కాస్త ఆ లెక్చరరుగార్ని కలుసుకుని అమీ తూమీ తేల్చెయ్యండి" అని సాగనంపింది.

వీథిమొగ తిరుగుతుండేవరకూ నిఒబడి, తన వైపు చిరునవ్వు నవ్వి, లోపల్కి వెళ్ళింది. పొంగిపోయాడు యాజులు.

మూడుకవర్లూ ఓసారితీసి, ఎడ్రస్‌లు చదివేడు. ఒకటి వెంకట్రామయ్యగార్కి, రెండోది ఎవరో స్నేహితురాలు, మూడవది తన మామగారికి. మొదటి రెండూ ఎల్లావున్నా, మూడవ వుత్తరం, ఈ అపరిచిత వ్యక్తి, తన్నిగురించి, తన లీలల్ని గురించి వ్రాయడం కోపం తెప్పించింది. తగుదునమ్మా అంటూ, ఈవిడకు ఎవరు పసుపూ కుంకుమా పెట్టి అగ్యతపీఠం అందించేరు ఈ వ్రాయడానికి? అన్న వెర్రికోపం వళ్ళంతా క్రమ్మతే, కవరు చింపేసేడు; ఏం వ్రాసిందో తెలుసుకోవాలన్న కుతూహలంలో.

చక్కటి బ్యాంకుపేపరు. పైన రోజాపువ్వు. కాస్త వాసనవేస్తున్న సెంటు. ఒక్తి కౌగిలం వుంది; కనీసం చెవ్రాలేనా లేకుండా. తెల్లబోయాడు. వెనువెంటనే 'ఈ కాలపు ఆడపిల్లలు ఎంతకేనా తగుదురు. ఏ రహస్యపు సిరాతోనో వ్రాసివుంటుంది' అన్న తలంపుతో దారిలోవున్న రామారావు ఇంటికి వెళ్లేడు.

"ఒరే! రామం. కాసిన్ని నిప్పులు గరిట్లో పట్టుకురారా!" అని ఆదేశించేడు. ఏ చెయ్యనెప్పేనా పట్టిందేమో అనుకుని రామారావు కంగారుపడ్డాడు.

కౌగిలం మడతలియ్యడం విప్పడం, నిప్పుల సెగని వేడచెయ్యడం చూస్తే రామారావుకి అర్థం అయ్యింది. ఒక్కమారుగా నవ్వేస్తూనే "ఇదా సంగతి. ఈ ప్రణయకలాపం ఎప్పటినుండిరా! నాన్నా?" అన్నాడు.

ఎంత వేడిచేసినా ఏమీ కన్పడనేలేదు. విసిగిపోయి పళ్లెంలో నిప్పుపట్టుకురా అనడం, ఆ కౌగిలం నానడంవరకే జీవితసమాప్తి చేసుకోవడంతో, మొఖం తెల్ల వేసేడు యాజులు.

"ఎవ్రరా ఆ పిండం! మా గడుగ్గాయిలా వుందే."

"చచ్చింది గొడ్డు!" అని "ఒరే రామం! నీకు బెజవాడ, నరసారావుపేటల్లో ఎవరేనా తెలిసినవారున్నారు రా?" అని అడిగేడు, మిగిలిన రెండుకవర్ల ఎడ్రస్‌లూ జ్ఞాపకం తెచ్చుకుంటూ.

యాజులువరస అర్థంకాలేదు రామారావుకు. బెజవాడలో ఇద్దరు ముగ్గురు పేర్లు చెప్పేడు. నరసారావుపేట విషయంలో, ఆఫీసులోవున్న చింతామణి మామగారివూరు అనీ అన్నాడు.

వాళ్ళిద్దరికి ఉత్తరాలు, అందులో పుట్టుపూర్వోత్తరాలు కావాలని నిర్ణీతాల్తో రామారావుతో వ్రాయించి, పోస్టాఫీసులో పడేసే ఆఫీసుకువెళ్లేడు. చింతామణిగార్ని రప్పించి, ప్రాధేయంలేని ఆదేశాలతో ఉత్తరం పోస్టుచేయించేడు.

ఆసాయంత్రం అయ్యేసరికి ఆఫీసంతా గుప్పుమని పోయింది. 'యాజులుగారు మళ్ళీపెళ్ళి చేసుకుంటున్నారు. బెజవాడ వెంకట్రామయ్య వకీలుగారి పిల్ల' అని. దాంతో మూడుకూపాయలు చెల్లించి 'టీ' ఇచ్చేవరకూ వాళ్లు వదల్నేలేదు యాజుల్ని.

ఇంటిమలుపు తిరిగేసరికి, ఇంటి ముసలావిడ ఎదురుపడుతూనే "అమ్మగార్ని తీసుకువచ్చినట్లున్నారు?" అంది నిలబెడుతూ. ఆశలుపెట్టుకున్న కళ్ల కిరాణందుకాణం ఆవిడ, కట్టేఁమ్మకునేది, శరీరాన్ని పట్టపు ఏనుగులా పెంచిన గుమాస్తాపెళ్లామున్నూ పొంచి పొంచి, పొడిచినట్లే చూచేరు.

అమ్మగారు కాదు. స్నేహితులన్నా, చుట్టాలన్నా రేపటినుండి ఆవీథిని నడవడానికి హుక్కుపోతుంది నీలివార్తల్లో. అదే భయపెడితే, మాట్లాడకుండానే ఓ చిరునవ్వు నవ్వి ముందడుగు వేసేడు.

వెనకనుండి నిట్టూర్పులు విన్నానా, లేదా అన్న సంశయంతో గుమ్మంలోకి రానేవచ్చేడు. లోపల ఏదో రాద్ధాంతం అయిపోతోంది అన్నవార్త చెవులకు అందితే కట్రాడే అయ్యేడు.

"పెళ్ళిచేసుకుందామనుకుంటున్నావా?"

"అవును."

"ఎన్నాళ్ళనుండి ఎరుగుదువు ఆయన్ని?"

"గడచిన ఎలక్షన్‌లో ఒకే పోలింగుస్టేషన్లో పని చేసేం. అప్పటినుండి."

"ఆయనకు పెళ్ళి అయింది తెలుసా?"

"పెళ్ళా!"

"చిన్నప్పుడే!"

"మరి కాలేదన్నారే!"

"అంతకంటె అవసరానికి మరేం చెపుతారు మగాళ్ళు. నీవనుకుంతా ఏ బుగ్గిలో పడింది ఆమాత్రం తెలుసుకోలేనందుకు?"

"రానివ్వండి. నిలబెట్టి కడిగేస్తాను."

"ఏమని?"

"చేసిన పనే."

"నువ్వూ చెయ్యలేదు తప్పు? ఆయన్ని ఏమని నిలబెట్టి అడుగుదామనుకుంటున్నావ్?"

శ్రుతిమించి రాగాన్ని పడి, ఏ శిగపట్లగోత్రం వరకూ వెళ్ళుతుందేమో అని భయపడ్డాడు యాజులు. ఏదో జరుగుతున్నది జరగనివ్వకుండా లిల్లీ ఇక్కడకు వచ్చి, ఈ రాద్ధాంతాలేమిటి? ఆవిడమాత్రం ఇవన్నీ కూడా కెలికి బట్టబయలు చెయ్యడంలో అర్థం? పాలుపోలేదు. ఇంట్లోకి వెళ్ళితే ఇద్దరూ చెరోపెడా రెక్కలూళ్ళు విరిచేస్తారేమో అన్న భయం, చెప్పుల్లో కాళ్ళెట్టుకుని తనుమాత్రం ఎంతసేపు నుంచోగలను అన్న అభిజాత్యం పీకేయి.

"ఇంతకీ మీరెవరు?" అంది లిల్లీ తాపీగా.

"నేనా?" అంటూ ఆవిడ ఆగిపోయింది.

"చెప్పరేం? నన్ను తూట్లుపొడుస్తూ మాట్లాడుతున్నారు. ఈ ఇంట్లో మీ హక్కేమిటి?"

గుండెలు దడదడలాడేయి యాజుల్కి. చెవులోరబెట్టి విన్నాడు.

"ఆయన మా బావ! తెలిసిందా?"

'ఆ' బహుళః నో రెండిపోయి ఉంటుందనుకున్నాడు లిల్లీకి. ఒక్కటి ఆవిడ తన్ని 'బావ' అని అనడం మధురత కల్గించింది. వళ్ళంతా కితకితలు పెట్టినట్లయ్యింది. వెనువెంటనే ఆవిడలో పూసుకున్న మళుపులు, బిగువులు, కళ్ళల్లో కురిసే హొయలు, ఒక్కొక్కటే ఎదుట తిరిగేయి. లిల్లీకన్న వెయ్యిరెట్లు అందమైంది అనే నిర్ణయంతో బాటు, తన్ని బావ అని పిల్చినశబ్దాన్ని రామనామస్మరణలా తలచుకుంటూనే బజారునపడ్డాడు; ఈసమయంలో లోపలికి వెళ్ళడం మంచిది కాదనుకుంటూ.

కాఫీత్రాగేదు హోటల్లో. ప్రొద్దున తాగినట్లుగా లేకపోతే సగం చచ్చిలేనేను. ఆవిడజ్ఞాపకం ఎక్కువై పోవడంతో, ఆ మార్కుల వేట ఇప్పుడప్పుడే చెయ్యకుండా 'వూళ్ళోలేడు లెక్చరరు' అని వంక చెబితేనో; ఈవూరికి దగ్గరగా రామప్పదేవాలయం, పాకాల చెరువు వరంగల్ కోట చూడవలసినవంటేనో; రాజధాని ముఖ్యపట్టణం హైదరాబాదు చూడవలసింది వేళ్ళామూ అని ప్రోత్సహిస్తేనో; ఎన్నో ఒకటితర్వాత ఒకటి మార్గదర్శికలు అయ్యేయి. దాంతో ఉత్సాహం పొంగింది; హుషారు వచ్చింది. ఎప్పుడు కాల్చనివాడు సిగరెట్టుకొని వెలిగించేను.

మొదటిపీల్పు సరిగ్గానే పైకి వచ్చింది. ఉత్తేజం కల్గింది. వెనువెంటనే రెండోదమ్ము పీల్చేసరికి ఉక్కిరిబిక్కిరి అయి కళ్ళమ్మట నీళ్ళు, దగ్గు వచ్చేయి. దాంతోటే లిల్లీకూడా తలంపుల్లోకి వచ్చేసింది.

ఈముండ నెలకు యాభైరూపాయలు పుచ్చుకుంటున్నా, ఇవ్వాళజరిగిన విశేషంతో తన్నిగుమ్మెత్తిపోసి, సాయంకాలం ససైన్యంగా తల్లిని, తమ్ముడిని ఇటూఅటూవాళ్ళని తీసుకుని దండయాత్ర చెయ్యకుండా వుంటుందా? అన్నభయం చెమటలు పోయించింది. వణికిన్నిపోయేను. భగవంతుడే జ్ఞాపకం వచ్చేను.

దాంతో ఉడుతూ మడుతూనే లిల్లీ ఇంటికి వెళ్ళేడు. మంచంమీద పడుకుని ఏడుస్తున్నదాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు. ఒక్కసారి గాలివాన విసరేసింది. నెమ్మదిగా అన్నీ చెప్పేను. ఆవిడ ఎవరో తెలియదు అన్నాడు. తనకి పెళ్ళికాలేదని వాగ్దానమూ చేసేడు. ఏమడిగితే అన్నీ చేష్టలుడిగిన బొమ్మలా విని, 'ఊ' కొట్టేను.

"అయితే అది ఏదో బాగా చేతులుతిరిగినదానిలాగే కన్పిస్తోంది. నిన్ను తిరుపతి పంపిస్తుంది" అంది లిల్లీ.

"అల్లా ఊరుకుంటే ఎల్లాగా? పోలీసులకు రిపోర్టు ఇయ్యవయ్యా" అంది లిల్లీ తల్లి.

"అవును. ఆపని చేస్తే సరి" అంటూనే కాగితం, కలం తెచ్చి వ్రాయించి మావాడిచేత పంపిస్తా" అని పుచ్చుకుంది లిల్లీ.

వెళ్ళేటప్పుడే "ఎంత మంచివారు" అంటూ పళ్ళెంలో పదిరూపాయలు ఆ పోలీసులకు మామూళ్ళక్రింద తీసుకుని, ఒక్కసారి గట్టిగా ఒత్తుకుని, చుకుక్కున పెదిమలు కాచింది.

కాష్ఠంమీద పెట్టినట్లయ్యింది యాజుల్కి. గబగబా అడుగులు వేసుకుంటూనే ఇంటికి వచ్చేను.

విడిగి, విరజిమ్మే వాసనల్తో మల్లెపూలు గాలికి ఇటూ అటూ నిగలోంచి ఆడుతుంటే, కథలపుస్తకంలో మర్చిపోయివుంది ఆవిడ.

"మీకోసం నిన్న సినీమాలో కలుసుకున్నావిడ వచ్చి, చాలాసేపు కూర్చుని వెళ్ళింది" అంది తల ఎత్తుతూనూ, అతి అమాయికంగానూ.

"అల్లాగా!" అన్నాడు కొంచెం దీర్ఘంతో. పనికట్టినట్లే "మీరు మళ్ళా వెళ్ళాలేమో! అన్నం వడ్డించనా?" అనేసింది.

టాపేరం ఎగిరిపోయింది యాజులుక్కి.

"రేపురాత్రి సర్కారులో నా స్నేహితురాలు వస్తోంది. ఆవిడని రిసీవ్ చేసుకోవాలి మనం" అంది మళ్ళీ కంఠం మారుస్తూనూ.

ఒక్క ఈవిడే చాలు ఈ ఖాండవదహనానికి. ఇంకొకత్తి వస్తే పూర్తి లంకాదహనమే అనుకుని బెదిరిపోయేడు. జరిగింది చెప్పకుండా, వెర్రిగా మనసులో నీ భరతం పట్టడం అట్టే కాలం లేదు అని అనుకున్నాడు.

* * *

అటు ఇంట్లోకి ఈవిడంత ఎత్తు. పొడుగు, రంగు మొఖం, కవలల్లావున్న క్యాముల రావడం, ఇటు మర్నాడు బెజవాడ, నర్సరావుపేటలనుండి ఉత్తరాలు రావడం జరిగేయి.

ఎంతో తొందర ఆతురత చూపినా నేఉత్తరాలు చింపేడు. బెజవాడ ఉత్తరంలో "వెంకట్రామయ్య గారు ఈ వూళ్ళోకల్లా పేరుమోసిన క్రిమినల్ వకీలు. రెండు అంతస్థుల మేడలు నాల్గు, మంగళగిరి ప్రాంతములో సుక్షేత్రం ఏభైఎకరాల మాగాణి, పైగా వడ్డీ వ్యాపారాలమీద ఓ లకారం తిరుగుతూనే వుందన్న వాడుక.

"ఈయనికి కొందరు ఇద్దరుభార్యలని, వాళ్ళు ఇద్దరూ చెరో కూతుర్నీయిచ్చి జరిగిపోయేరని చెపుతారు. ఇప్పుడు కవలల్లావుండే వాళ్ళిద్దరూకూడా కాలేజీ చదువులు చదువుతున్నారు.

"ఇద్దరికీకూడా పెళ్ళికాలేదు. ఆస్తి ఆయన తదనంతరం వీళ్ళిద్దరికీ వ్రాస్తాడన్న నిరుకు. పైగా వాళ్ళిద్దర్నీ కూడా పెద్దచదువులు చెప్పించాలని, ఇప్పట్లో పెండ్లి చెయ్యకూడదన్న వార్తకూడా అమల్లోవుంది.

"ఏది ఎల్లావున్నా, ఈ గారాబం, పెంపకంవల్ల వాళ్ళిద్దరూకూడా రణపెంకి, రాలుగాయిలుగానూ తయారయ్యేరన్నది, ఏ సంబంధం వచ్చినా, ఆ పెండ్లి కొడుకును చిత్రవధచేసి పంపుతారన్నది వాడుకపరం అయ్యింది.

"అందుకే ఇద్దరికీ పెండ్లి కాకుండా ఉండిపోయింది" అని ఉంది.

ఇక రెండో ఉత్తరంలో "ఆ అమ్మాయి యీ వూళ్ళో ఓ వర్తకుగారి అమ్మాయి. కాలేజీలో చదువుతోంది. పెండ్లి చిన్నప్పుడే అయ్యింది.

"మొన్న సెలవులకు శుభం కానిచ్చి అత్తవారింటికి పంపేరు" అనీవుంది.

మొదటి ఉత్తరం చదివేసరికి యాజులుకు శరీరం పులకరించింది. అయితే వీళ్ళిద్దరూ వాళ్ళేనన్నమాట. తనమీద ఎందుకు యీ దండయాత్ర చేసేరో అన్నది అర్థంకాలేదు. ఈ మార్కులవంకని మొగుళ్ళను వెతుక్కుంటున్నారా అన్న సంశయమూ కల్గింది. ఒక్క ఈఉత్తరం ఆధారంగా తను ఉద్దేశించుకుంటున్నాడు వాళ్ళు వీళ్ళే అని. అంతకన్న ఇంకో సాక్ష్యమేమీ లేదు.

పైగా వెంకట్రామయ్యగారు చెప్పేరు. మీ దగ్గరకు వెళ్ళమని అని అనడం. తను జ్ఞానం వచ్చినతర్వాత ఆయన్ని కలుసుకున్నట్లుగాని, చూచి మాట్లాడినట్లుగాని గుర్తులేదు. ఓ వేళ తన తండ్రి లావాదేవీలు చూస్తున్న వకీలు అనుకుందామనుకున్నా, తనకు తెలిసినంతవరకూ ఇల్లాంటి పేరున్నాయన వున్నట్లు తెలియదు. పోనీ అంతపొడుగు చరిత్రలు వ్రాసినవాడు పేర్లయినా వ్రాయకూడదూ. అని తిట్టుకున్నాడు; వాట్లవల్లేనా కొంతదారి దొరికివుండును అనుకుంటూ.

ఇక రెండోవుత్తరంవల్ల అమీతుమీ తెలియలేదు. ఆ వెర్రిమొఖం, ఆ అమ్మాయి విషయం, స్నేహితులు, వగైరాలన్నీ వ్రాయకుండా, కార్యం చేసుకుని మొగుడితో కులుకుతోంది, అన్న ముక్తసరి జవాబు, మొట్టికాయ మొట్టాలనిపించింది. ఏ భావన ఎల్లావున్నా, నరసారావుపేటవైపు ఓ పెద్ద రాతిగోడ కట్టుకోవలసివచ్చింది.

మెరుపుకొట్టినట్లుగా వీళ్ళిద్దరూ 'ఏ ఇంటిదగ్గరా చెప్పకుండా పారిపోయివచ్చిన ఘటాలు కావు కదా?' అన్న తలంపు వచ్చింది. దాంతో ఇల్లాంటి ప్రకటనలు చేసే పత్రికలేవైనా వున్నాయా అని ఆలోచించేడు. హిందూ, ఆంధ్రపత్రిక, ప్రభ, గుర్తుకువస్తే, వెంటనే

పేపర్లు అమ్మేకొట్టుకు వెళ్ళి ఆరోజువి కొంటూనే, ప్రతిరోజూకూడా కావాలి అని ఎడ్వాన్సు చెల్లించేడు.

గజిబిజగా చూచేడు. ఒక్కటైనా కన్పించక పోయేసరికి మనస్సు చివుక్కుమంది. చంపుకోలేని ఆశ, వెనుక పత్రికల్ని వెతికించి వాటిని ఖరీదుకు కొన్నాడు. అవ్వీ అల్లాగే వుండడంతో, గాడిదబరువునూ చంక నెట్టుకుని చౌరస్తాలోకి వచ్చేడు.

ఎక్కడ చూచేడో రామారావు పరిగెత్తు కుంటూ నేవచ్చి "ఏమిటిరా పాత పేపరన్నికొన్నావు. ఏమైనా మేట్రిమోనియల్ కాలమ్స్ చూస్తున్నావా?" అన్నాడు జబ్బతట్టుతూ.

"నీకు తెలియదులే!" అనేసేడు ముఖంతిప్పుతూ.

"అయితే మళ్ళీ బ్లాంక్ చెక్కు ఏమైనా వచ్చేయా?"

వాడు వదిలిపెట్టేటట్లు కన్పించలేదు. జరిగింది చెపితే 'ఎంత వెర్రివాజమ్మవురా' అనేస్తాడేమో అన్న పిరికితనం. పైగా 'ఇల్లా వచ్చేరురా' అంటే వెటకారంతో 'వతి శ్రీసుకుడే అయితే నీపని హుళక్కి' అంటాడు అన్న నిజంకు.

"వెంకట్రామయ్యనిగురించి ఏమని వచ్చిందిరా?"

"ఏముంటుంది? ఆయనో ప్లీడరుట. డబ్బున్న వాడుట. అంతే."

"అయితే పెళ్ళి అవవలసిన పిల్లలు లేరా ఆయనకు?"

తెలూపేడు. వీడు ఎల్లవదులుతాడా అన్న ఆలోచనలో నే "రా! రా! ఓ కూల్ డ్రింక్ త్రాగి వద్దాం" అనేసి దారి తీసేడు.

కిటకిటమనే సమయం. ఖాళీకోసం వెతుక్కుంటున్నప్పుడే "ఒరే యాజులూ ఇల్లారారా!" అన్నాడు శ్రీపతి.

"చచ్చేం" అనుకుంటూ నే నడిచేడు యాజులు. ఉన్న స్నేహితుల్లోకల్లా వదురుబోతు ఈ శ్రీపతి. కళ్ళమ్మట నీళ్ళు తిరిగేవరకు వదలడు వేళాకోళాల్లో.

"అరే! అబ్బీ! చెప్పేవుకావు. భాభని ఎప్పుడు తీసుకువచ్చేవురా? ఇందాక నువ్వు వున్నావో లేవో అని మీఇంటిమీదుగావచ్చి పిలిస్తే, ఒకళ్ళు కారు ఇద్దరువచ్చి 'ఇంకా ఆఫీసునుండి రాలేద'న్నారు. మరి చెప్పేవు కావు ఎంచేతనురా?" అనేసేడు శ్రీపతి.

రామారావుకు గూబ గింగురుమన్నట్లు నోట మాట రానేలేదు.

యాజులు నుంచున్నపళంగా కుర్చీలో కూల పడ్డాడు. గబగబా బల్లమీద గ్లాసు నీళ్ళువుంటే గ్లాసున్నర త్రాగేవరకూ తేరుకోలేకపోయేడు. ఒకటి అనుకుంటే ఇంకొకటి ఎదురవుతోంది. తన జాతకం ఏమిటోకాని అన్న నిరాశ కల్గింది.

"ఏమిటిరా బెలంకొట్టేనట్లు చూస్తాడవు. ఓరే! శ్రీపతీ వీడేం గత మూడు రోజులనుండి నన్ను వీళ్ళ సంగతి అడుగు, వాళ్ళసంగతి తెలుసుకో అని చంపేస్తున్నాడు. ఏవేవో ఉత్తరాలు..."

రామారావుకు అర్థంవచ్చినట్లై "నోర్మూసుకోరా!" అన్నాడు యాజులు.

రామారావు అన్నమాటలు, యాజులు అడ్డం, శ్రీపతిని మరింతగా పురెక్కించేయి. "ఏంరా యాజులూ! ఏ డిన్నరేనా ఇవ్వవలసి వస్తోందనా దాస్తుంట. ఒకళ్ళు భాభి. మరి రెండోవారు మరదలా, చెల్లెలా, మేనకోడలా, మరి ఎవ్వరా?"

"ఆఫీసులో ఇచ్చేడురా టీపార్టీ."

"అయితే నన్ను పిలవలేదెందుకురా! ఓరే! సెర్వరూ, స్వీటు మూడు ప్లేటు. మసాలాదోసెలు బాగా రోస్టుచేసి మూడు చెప్పు......"

అప్రయత్నంగా జేబులు తడుముకున్నాడు యాజులు. రామారావుకు నవ్వువచ్చింది. ఈసమయములో రోజా భార్యఅంటున్న ప్రశ్న చెపుదామా వద్దా అన్న సమస్యలో పడ్డాడు. తెగా తెంపూ కానే లేదు.

"యాజులూ! ఏమీ అనుకోపోతే ఒక్కటి చెపుతాను. ఆ ఇదరిలోనూ కొంచెం ఛాయ తక్కువ అమ్మాయి నా పెళ్ళికి వచ్చినట్లు జ్ఞాపకంరా! మంగళ హారతిపట్టే కట్నంకు పోట్లాడిందికూడాను." అన్నాడు చుట్టరికాలు కల్పుకున్నట్టుగా శ్రీపతి.

"నిజంగా!" ఎగిరిపడ్డాడు యాజులు.

"మన జ్ఞాపకశక్తి సత్యాగ్రహం ఇంకా ప్రారంభించలేదు. కావలిస్తే రేపు ఓసారి మా ఇంటావిడను పంపమన్నావేమిటి?"

అంధకారంలో పేదరాసి పెద్దమ్మ ఆముదపు దీపంలాగే తడితే "పంపరా!" అనేసేడు.

"ఓరే శ్రీపతీ! దారేకా! మా ఆవిడా ఎన్నాళ్ళనుండో చూడాలనుకుంటోంది. పిలిస్తే ఇద్దరూ వెళ్ళ వచ్చు".

"ఓ. దానికేం? మరి విందుమాట?"

"మన కెందుకురా! వాళ్ళే నిర్ణయం చేసుకుని వస్తారు" అని నవ్వేసేడు రామారావు.

రెండుంపావులా బిల్లు, పైన కిళ్ళీలకు సిగరెట్లకు వదిలించుకుని, సందులో పడ్డాడు యాజులు.

గుండెల్లో రైళ్ళు పరిగెత్తేయి. మాటవరసకు వాళ్ళని రమ్మన్నాడే కాని, తీరా వచ్చి, ఈ ముక్కు మొహం తెలియని వాళ్ళను నిలబెట్టి "మీలో యాజులు పెళ్ళాం ఎవరు?" అని అడిగేస్తే, ఇంక ఆ ఇంటిగుమ్మం త్రొక్కే అవకాశం, మొఖం చూపించే ధైర్యం మంటకలసిపోతాయి.

పండిపోయిన ఎండురావాకులా అల్లాడిపోయేడు. వాళ్ళు రాకుండా వుంచడం ఎల్లాగో తనకి తెలియనే తెలియదు.

* * *

ఆవిడ, శ్యామల, ఇరువురిరూపం ఇంచుమించు ఒకటే అయినా, ప్రవృత్తుల్లో ఇద్దరిదీ తలోదారి. ముభావంగా, ముక్తసరిగా, ఒవినమైన అంతస్థులో నిలబడి తను పనులు చేయించుకోవడం, చేయడంలో ఆవిడకు ప్రత్యేకత వుంది. ఇక శ్యామల కొంటెకోణంగి. ప్రశ్నలు వెయ్యడం, అతిగా వాగడం, అర్థంపర్థం లేకుండా నవ్వడం, ఎదుటివాడిని పది అని తాను ఇరవై పడ్డం, ఇంకా చిన్నపిల్లలతత్వం ఒదులుకోలేనట్లు వుంటుంది.

ఉత్తరం చదివినప్పటినుండి, ఓ విధంగా ధనిక కుటుంబంలో పుట్టి పెరిగిన అలవాట్లు వీళ్ళిద్దరిలోనూ వున్నాయా లేవా అనే విమర్శన మొదలుపెట్టేడు. అవే తన పరీక్షలవల్ల ఉన్నట్లు తేలితే తప్పకుండా 'వీళ్ళిద్దరూ వెంకట్రామయ్యకూతుళ్ళే అయివుంటారు' అని నిర్ణయం చేసుకోవచ్చు. దాంతర్వాత 'ఎదుటబడి రహస్యాల్ని బట్టబయలు చేస్తే' తన చెయ్యి పై చెయ్యి అయిపోతుందన్న భావనా కల్గింది.

బజారుకు కూరలు పట్టుకొస్తానని వెళ్ళి, తేవాలనే, ఉల్లికోళ్ళు, చేమకూర కాడలు తెచ్చేడు. ఆవిడ తెల్లబోయింది మొదట్లో. రోజూ ఏ క్యాబేజీ, వంకాయ, అరటికాయ, నూల్ కోల్ తెచ్చే ఈ మనిషి ఉంకుండి ఒక్కసారి ఇల్లా మారిపోయాడే అని. వెనువెంటే ఏ సింగరాజు లింగరాజులా తయారవుతున్నాడేమో అన్న వూహా, నెలాఖరురోజులు వచ్చేయి కదూ డబ్బులకు ఇరకాటంగా వుందేమో అన్న అనునయింపుల్లో మాట్లాడలేదు. చిన్నగా నవ్వి వూరుకుంది.

శ్యామలా పొంచివున్నట్లుగానే "యాజులుగారు, ఉల్లికోళ్ళ పులుసు, చామకూర బజ్జీలు అంటే చెవి కోసుకుంటారు కాబోలు?" అంది.

ఎర్రచీమ కుట్టినట్లయ్యింది: తనమీదకే ఎదురుదెబ్బ.

"అవి అల్లాగే వండమన్నారా?" ఆవిడ.

"ఇంకా అడుగుతా వేమిటే?" మనసుపడి ఆయన తెచ్చుకుంటే, పతనసామ్రాజ్యాల పరోటాల్లోకి అవి వ్యంజనాలే. మధ్యాహ్నం చెప్పిందిగా ఇంటి ముసలావిడ; అల్లాగే వండు."

తెల్లబోయేడు ఇంటావిడ దండయాత్ర సాగించడంటే. "ఎందుకు వచ్చింది?"

"కబుర్లు చెప్పడానికి" ఇంకేమనిపోతుందో అని శ్యామలని కళ్ళతో శాసించింది ఆవిడ. అది చూడనట్లే "వచ్చినప్పటినుండీ, మా ఇద్దరిలోనూ ఇంటావిడ ఎవరూ అనే అపరాధపరిశోధనే. క్షణం ఆవిడను, క్షణం నన్నూ అనుకుని దిష్టి తీసేసింది. మిమ్మల్ని ఇంద్రుడూ, చంద్రుడూ అంటూ పొగడేసింది. ఆఖరున చెయ్యికూడా చూచి, ఎంత అన్యోన్యదాంపత్యం, ఇద్దరు పిల్లలు కూడా పుడతారట అంది." ఇద్దరూ నవ్వడం మొదలుపెట్టేరు. ఇరుకున పడిపోయి గుంజుకున్నాడు యాజులు. క్రమ్ముకుంటూనే

"ఆఖరుకు ఏమైంది?"

"ఏమవుతుంది. తల్లో ఎన్ని వెంట్రుకలున్నాయో లెక్కపెట్టించి, కళ్ళమ్మట నీళ్ళు తిరిగేవరకూ శ్యామల వదిలిపెట్టలేదు."

"మంచిపని చేసింది. లేకపోతే..."

"ఇంతకీ మీ పెళ్ళాం ఎవరో తెలియకుండానే వెళ్ళింది గొణుక్కుంటూ" శ్యామల అడ్డంగా అంది.

ఓసారి ఇద్దరివైపూ చూచేడు. రగులుకుంటున్న నిప్పుల్లా ఎగిరిపోతారేమో అనుకున్నాడు. ఆ ఛాయలు లేకుండా నవ్వుతూ, కళ్ళల్లో ఓవినమైన సంతోషం వెల్లుబుకుతుంటే, మనస్సు తేలిక పడింది. ఈ భావన తనకే వెలక్కాయ అవుతోంది. వీళ్ళ ప్రవృత్తి ఏమిటి? లోపల్లోపల ఈ విపరీత సన్నివేశాలను ఎల్లా తట్టుకుంటున్నారు? ఏది ఎల్లావున్నా తనమీద ఏర్పడ్డ భావన మేమిటి? ఏమైనా మనస్సు వగులుకుని తన్ని ఉచ్చుల్లో దింపుదామనుకుంటున్నారా? ఇదే నిజమైతే తను విచారించవలసిన విషయం లేనట్లు తట్టింది. ఎందుకంటే, ఆవిడ, శ్యామలల్లో తన్ని ఎంచుకోమంటే ఆవిడలోని గొప్పతనంకు మొదటిరోజునుండీ మనస్సు ఆర్ద్రపడిపోయి వ్యాకులపడిపోతోంది. గత్యాగత్యా ఇద్దరూ కూడా తనమీదనే ఆశపెట్టుకుంటే, ఎవర్ని అన్న విషమసంధి రానేరాదు అన్న ధైర్యం వుంది.

తనకి పెళ్ళయిందని, ఆవిడను ఒదిలిపెట్టేసేడని, లిల్లీతో సంబంధం పెట్టుకుని దిగజారేడని తెలిసి, ఆవిడ తనమీద గౌరవం, మనస్సు నిలుపుకుంటుంద అన్న ఆశ పెట్టుకోవడం వృథా ఏమో అనిపించింది. దాంతో హృదయం శూన్యం అయిపోయింది. తన కర్మ ఇల్లా వుంది కాబోలు. ఆఖరుకు ఇద్దరూ మొఖంమీద ఉమ్మేసి వెళ్ళిపోతారేమో అన్న బెంగా కల్గింది.

వాళ్లెవరు? తనెవ్వరు? ఈ కాలప్రవాహంలో అయాచితంగా కలుసుకున్నారు. కొన్ని రోజులు ఉంటారు. మళ్లీ విడిపోతారు. అన్న మంచిమనస్సు నిర్దేశించినా, దాన్ని ఒప్పుకోడానికి ఇష్టం కల్గలేదు. తలచుకోడానికే తప్పుకోలేదు.

“అయితే యాజులుగారూ! మా యిద్దరిలో ఎవర్ని భార్యగా వ్యవహరించ మంటారు?” శ్యామల నవ్వుతూనే అడిగింది.

పమిట చాటు వేసుకుని ఆవిడ సిగ్గుపడింది. సగం నవ్వుతోనే “నోర్మూసుకో” అనీ అంది.

ప్రశ్న ఝువ్వున తగిలింది. మొఖంమీద నెత్తురుచుక్క లేనేలేదు యాజుల్కి. జవాబు చెప్పడం చేతకాలేదు. దీనికన్న సోలెడు ఆముదం అల్లపురసం లేకుండా, ముక్కు మూసుకోకుండా త్రాగవచ్చేమో అని అనిపించింది. అయినా పురుషలక్షణం వదులుకోలేకనే, ఓసారి పర్యవేక్షించి నవ్వేసేడు.

ఇద్దరి గుండెలూ ఆ నవ్వుతో అనకట్టే అయిపోయేయి.

“కొంపతీసి ఇద్దర్నీ చేసుకుందా మనుకుంటున్నారా ఏమిటి? రాజుగారికి చిన్నభార్య పెద్దభార్య అన్నట్లు” ఈసారి శ్యామల వేళాకోళం జాస్తిగనే చూపించింది.

తట్టుకోలేకనే “అక్కడ పట్టమహిషి అడవుల్లో వుంది” అంటూనే యాజులు సావిట్లోకి వచ్చేసేడు.

ఎగిరి గంతేసినట్లుగా శ్యామ వంటింట్లోకి వెళ్ళి గోడకు జార్లబడ్డ ఆవిడని గట్టిగా కౌగలించుకుని, ముద్దు పెట్టేసుకుంది. కిలకిలా నవ్వు నవ్వింది. కళ్లు చెమ్మగిల్లితే తుడవనూ తుడిచింది, ఒక్కసారి ఆవేదన ఉబికిపోతే.

కాలు పెట్టినప్పుడే కనిపెట్టింది శ్యామల ఆవిడకు యాజులంటే హృదయంలో ఓ స్థానం ఏర్పడిందని. ఈనాటి యాజులు మాటలు మొదట్లో అర్థం కాక పోయినా, ‘ఆ పట్టమహిషి’ అన్నది పీకింది. అయినా ఆతను దారిలోకి వస్తే, విచారించ నక్కర్లేదు అనీ అనుకుంది.

చిన్నప్పటినుండి ఒకే ఇంట్లో పెరిగేరు. ఒక్కచోటనే చదివేరు. ఇప్పటికీ చదువుతూనే వున్నారు. ఆ జ్ఞానంలో తనకి అక్కయ్య అని మాత్రం తెలుసు. ఆవిడ నిజంగా తనతోబుట్టువేనా అనే సంశయం కల్గలేదు ఇన్నాళ్ళల్లోనూ. ఇప్పుడు అక్కయ్యకు పెళ్ళి అయితే, తనకి తర్వాత అనే భావన గగుర్పాటు కల్గించింది. ఈ వెర్రి వేపకాయ బావగార్ని మరదలు స్థానంలో బాగా లేవుడీలు కొట్ట వచ్చున్న ఆశా వుములుకుంది. చిన్నప్పుడు తల్లి పదే పదే “ఎప్పుడూ అక్కయ్య మనస్సు కష్టపెట్టకే” అని చెప్పిన మాటలు అర్థం కానే కాలేదు. అందులోని అంతరం ఇప్పటికీ తికమక పెడుతూనే వుంది.

పైగా అక్కయ్య ఇంటిదగ్గర మద్రాస్ వెళ్ళి వస్తా, స్నేహితుల దగ్గరకు అని చెప్పి, చేసింది ఇల్లా ఎందుకో అన్న దానికి సమాధానం దొరకలేదు. అమ్మ మాటలు మీదుగా దాన్ని నిలబెట్టి అడగలేకపోయింది. ఏదో కారణం వుండితీరాలి అని అనుకోవడమే కాని, అదేమిటో పాలిమేరల్లోనైనా వాసన తగలటంలేదు.

‘అవన్నీ తనకెందుకూ’ అనుకునే ఈ విచిత్ర వాతావరణంలో, తానూ ఇంట్లోవారిక్రింద చేరిపోయింది శ్యామల.

అప్పుడే వచ్చిన పేపర్లు కంగారుగా తిరగవేస్తూనే యాజులు మునిగిపోయేడు; శ్యామల వచ్చి చిలిపిగా అల్లరికళ్ళతో పొడిచి చూస్తోంది అన్న భావనేనా లేకుండా. త్రుళ్ళిపడ్డట్లు ఎగిరేడు యాజులు ఒక్కసారి. ఓ మూలగా పేపరులో అంతా ఆవిడ వర్ణనతో, ఇంటి దగ్గరనుండి చెప్పకుండా పరారీ అయ్యింది. దగ్గర రెండువేలు వరకూ డబ్బువుంది. ఆచూకీ ఇచ్చినవాళ్ళకు మంచిగా బహుమానం ఇస్తాం అన్న వాక్యాల మీదుగా “చిన్నీ! అమ్మ నీకోసం బెంగ పెట్టుకుంది. నీకు ఆ అక్కర్లేని సంబంధం చెయ్యం. ఇంటికి రా! మా కళ్ళు కాయలు కాసిపోయేయి” అని వుంది. ఎడ్రస్ కేర్ ఆఫ్ పత్రికల్తో అంతమూ అయ్యింది.

కంగారుగా లేస్తూనే, ఉత్తరం వ్రాసేసి, కవర్లో పెట్టి అంటించేసేడు హుషారులో.

శ్యామలకు అర్థం కాలేదు. ఏం వ్రాస్తున్నాడో అని తొంగిచూసేంత చనువూ రాలేదు. ఏమైనాసరే అనుకుంటూ “వధువు కావాలని ఉత్తరాలు వ్రాస్తున్నారా? అల్లా అయితే వరుడు కావాలని ఉంటే నా పేరకూడా ఒకటి వ్రాసి పడేద్దురూ. మీకు పుణ్యం వుంటుంది.” అనేసింది.

నవ్వుతూనే “ఇంకా నేను నిర్ణయం చేసుకోలేదుగా మరి. అప్పుడే ఏం తొందర” అన్నాడు యాజులు గుండెలు కొట్టుకున్నా.

“ఇల్లా అన్నవాళ్ళందరూ ఆఖరుకు ఆ అడవుల్లో వున్న పట్టమహిషుల దగ్గరకే వెళుతారు.”

కంచీ పుచ్చుకుని. వీపుమీద ఛెళ్ళుమనిపించి నట్లయ్యింది. బాగ గుండెలు దూసుకుపోనేపోయేయి. తల గోక్కున్నాడు.

భోజనాలదగ్గర, ఏదో పెద్ద పత్తేదారులా తను కూరలు తెచ్చి పరీక్షలు చేద్దాం అనుకున్నది, తన మొఖం బొప్పికట్టినట్టే అయితే, ఆ ఉప్పూ కారం వేసిన

చామాకులు, బెల్లంవెయ్యని ఉల్లికోళ్ళపులుసు, ఉగ్గూ పాలతో తేనెఊటట్లువున్నా. కటుకరోహిణి కషాయం త్రాగినట్లుగానే తిన్నాడు ఆభిజాత్యంతో. వాళ్ళిద్దరూ విరగబడినవ్వడంతో పౌరుషం వచ్చేసింది; ఎంత బాగా బుద్ధిచెప్పేరన్న విచక్షణజ్ఞానంపోయి రుసరుసలతోనే.

"మధ్యాహ్నం మంచి ఫలహారాలు చెయ్యవే పాపం. అన్నం తినలేకుండా వున్నారు." అంది శ్యామల.

ఆవిడ నవ్వుతో గాలంతా నిండిపోతే కంగారుగానే బయటపడి, గాలిపీల్చుకున్నాడు కుమిలింపులో. సగందూరం వెళ్ళేటప్పుడు రామారావు శ్రీపతుల భార్యలు సంసారం చూడ్డానికి వస్తారన్న వార్త బెంబేలుచేసింది. చెప్పనైనా చెప్పేనుకాను అనుకున్నాడు. వెంటనే "రెండుకు రెండే! ఉద్దండపిండాలు. నుసిపూసి మారేడుకాయ చేస్తారు" అన్న ధైర్యంతో నడిచేడు ఆఫీసుకు.

చింతామణిని పిలిపించి, ఉత్తరం వ్రాయవలసిన పంథాలో నరసారావుపేటకు వ్రాయించేడు. చివర్న ఆ పిల్లవిషయంలో ఏవిధమైన రహస్యాలుకూడా బట్టబయలు చేయబడవు అని కూడా ఇరికింపించేడు.

ఈ విచిత్ర పరిణామాలు, మనుష్యులు, చర్యలు ఇవన్నీ వింతగా, క్రొత్తనీరు వచ్చినట్లైతే, మనస్సు ఏదో సుఖంగా, హాయిగా వున్నదనిపిస్తే, మధ్య మధ్య తలచుకుంటూనే, నవ్వుకుంటూ ఆఫీసుపని చేసేసేడు. రెండుమూడుసార్లు తాబేదార్లను నవ్వించేడు.

'పెండ్లి కళవస్తోంది' అన్న ముసిముసినవ్వుల్లోనే వాళ్లు వుంటే ఇంటికే వచ్చేసేడు. అడుగుపెట్టేటప్పటికే గుమ్మంనున్నట్లుగా, పెట్టెలు, పడింగులు, ప్లాస్కులు సావిట్లో వున్నాయి. ఎక్కడెక్కడ సద్దుతున్నట్లు శబ్దమూ వినిపించింది. ఊపిరి ఆడనే లేదు యాజులుకు.

శ్యామల రివ్వున వస్తూనే "ఏమండి? అంత నీతిజాతి లేనివాళ్ళ మనుకున్నారా? దొంగలం అనుకున్నారా? లేకపోతే పోలీసు రిపోర్టు ఇస్తారా? ఆ అడ్డమైనవాళ్ళు వచ్చి మమ్మల్ని నానా ప్రశ్నలు వేస్తారా?" ఉరిమింది.

ఆవిడా అందుకున్నట్లే "ఆ మాట మొట్టమొదటే చెపితే ఏం పోయింది? పెద్దమనుష్యుల్లా, ఉండనవడం ఎందుకు? వెనకనుండే ఇల్లంటే అనుమానాల్లో, మానాభిమానాలు లేనట్టుకుంటూ కత్తిపోటు పొడవడం ఏమిటి?" తాళంగుత్తి మొఖాన్ని విసరినట్లుగా విసరి "అవిగో మా పెట్టెలు. విప్పి పరీక్ష చేయించుకోండి, మీ సామానులు ఎన్ని దొంగతనం చేసి పరారీ అయిపోతున్నామో!" అన్నది.

"మేము మీ రాత్రికే వెళ్ళిపోతున్నాము. ఏదో మహాగౌరవనీయులు అనుకున్నాం. ఎప్పుడూ ఈ మగాళ్లు ఇంతే!" అని ఈసడించేసింది శ్యామల.

"జన్మలో మర్చిపోం మహానుభావా" అంది ఆవిడ.

ఏ ప్రాతివత్యమహిమా వుంటే, కాళ్ళక్రింద భూమి బ్రద్దలై తనని భూమాత ఎందుకు మ్రింగెయ్యలేదు, అన్నంత ఆక్రోశం వచ్చేసింది యాజులుకు. గత నాలుగురోజులనుండి పచ్చగావున్న ఇంటిని, తన చేతుల్తో తనే అగ్గి ముట్టించి, ఆహుతి అవుతుంటే చూస్తున్నవాడిలాగే కూలపడ్డాడు.

"శ్యామూ! ఆ తాళాలు తీసి చూపించవే!" అన్న ఆవేశంతో, గుత్తి తీసుకుని పెట్టెమూతలు తెరిచింది శ్యామల. చీరలు, లంగాలు, జాకెట్లు వగైరాలన్నీ చిందరవందరగా బయటకు లాగేసింది 'చూడవయ్యా' అన్నట్లు కొరకంచు చూపుల్తో.

అతి నెమ్మదిగానే "ఏమండీ! ఒక్కమాట వింటారా?" అన్నాడు. అందులో శాంతం మూర్తీభవించింది.

అదిరిపడ్డారు ఇద్దరూ శబ్దభేదానికి.

"ఒక్కొక్కసారి, ఎంత తెలివైనవాడైనా అడుగు తడబడి జారడం తటస్థిస్తుంది. దానికి అతీతంగా వుండే వాతావరణం, మనుష్యుల ప్రభావం చాలామటుకు కారణం కావడం సహజం. అలాంటప్పుడు తప్పు, ఒప్పు విచక్షణాజ్ఞానం పోయి మానవ పతనం జరగడం నిజంకూడాను."

ఏమిటీ తత్త్వధోరణి అని విస్తుపోయేరు ఇద్దరూ.

"అలాగే అయ్యింది నాపని" ఆగిపోయేడు.

ఆవిడకు మెరుపు కొట్టినట్లయ్యింది. "అయితే ఆ లిల్లీ వ్రాయించిందన్నమాట" అంది.

తలూపుతూనే "అప్పుడు వ్యామోహంలో ఏమి వ్రాసేనో కూడా తెలియనేలేదు. ఆ బుద్ధిహీనతకు నేను క్షంతవ్యుణ్ణో" అని అనేసేడు. మనస్సు కుమిలింపుల్లో అఖరుమాటలు తడబడ్డాయి.

ఆవిడ అదిరిపోయి అవ్యక్తంలో బావపడిపోయింది. లిల్లీ ఎవరో తెలియక శ్యామల అక్కవైపు, యాజులువైపు కళ్ళు త్రిప్పుకుంటూనే కూలబడింది. గిరుక్కున తిరిగి లోపలకు వెళ్లిన అక్కయ్య, తిరిగి వస్తూనే కాఫీ ఫలహారాలు ఆయన చేతుల్లో పెట్టి ముసిముసిగా నవ్వెయ్యడం, ఈ అనుకోని అనునయానికి కంగారుగా అతడు పళ్ళెంబగులు ఆమె చెయ్యినే పట్టుకుని, తప్పకు తేరుకుంటూనే. తలవంచుకోడం, చూస్తే, శ్యామలకు, 'విళ్ళిద్దరూ కలసి నన్ను ఒక్క వెర్రిదాన్ని చేసేసేరు' అన్న పౌరుషం పొడిస్తే, రుసరుసమంటూ చూచింది; పెట్లోంచి తీసినబట్టలు మళ్ళీ పెట్టాలా అక్కర్లేదా అన్న జిజ్ఞాసలో ఊగిసిపోయింది.

[సశేషం]